క్లుప్తంగా

18న 'నన్నయ'లో యోగాంధ్ర

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఈ నెల 18న యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. యూనివర్సిటీ సెమినార్ హాలులో ఎన్ఎస్ఎస్ అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో దీనిపై చర్చించారు. విద్యార్థులంతా యోగాంధ్ర పోర్టల్‌లో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకునేలా అధ్యాపకులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ పాల్గొన్నారు.

అన్న సమారాధన

కోరుకొండ: పశ్చిమగానుగూడెం గ్రామ దేవత భూలోకమ్మ తల్లి జాతర ముగింపు సందర్భంగా మంగళవారం అన్న సమారాధన జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు రూ.30 వేల విరాళం అందజేశారు.

రేపు మండల పరిషత్ సమావేశం

రాజానగరం: మండల ప్రజాపరిషత్ సమావేశం ఈ నెల 12న ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ జేపీ ఝాన్సీ తెలిపారు. ఎంపీపీ మండారపు సీతారత్నం అధ్యక్షత వహిస్తారని చెప్పారు. ఈ సమావేశానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తగిన సమాచారంతో హాజరుకావాలన్నారు.

హోటల్‌లో తనిఖీలు

బిక్కవోలు: బలభద్రపురంలోని ఓ హోటల్‌పై ఫిర్యాదులు రావడంతో పంచాయతీ, ఫుడ్ సేఫ్టీ అధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి సంజీవరెడ్డి వివరాల మేరకు, ఈ హోటల్‌పై మల్లిడి సత్తిరెడ్డి అనే వ్యక్తి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు తనిఖీ చేశారు. హోటల్ వద్ద చెత్త ఎక్కువగా ఉందని, ఇంటి కలపతో వంటలు చేస్తుండడంతో పొగ ఎక్కువగా వస్తుందని గుర్తించారు. ఆహార పదార్థాల శాంపిళ్లు సేకరించి, వాటిని హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పరిశీలన కోసం పంపించామని సంజీవరెడ్డి తెలిపారు. అక్కడి నుంచి వచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీలో ఫుడ్ సేఫ్టీ అధికారి రుక్కయ్య పాల్గొన్నారు.

వీఆర్ఏపై స్నేహితుడి దాడి

బిక్కవోలు: కొంకుదురు వీఆర్ఏ తాడికొండ సతీష్‌పై అతడి స్నేహితుడు గణేష్ దౌర్జన్యం చేసినట్టు కేసు నమోదు చేశామని ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ మంగళవారం తెలిపారు. ఆయన వివరాల మేరకు, కొంకుదురు గ్రామంలో వీఆర్ఏ సతీష్‌కు కొద్ది రోజుల క్రితం గణేష్ పరిచయమయ్యాడు. వారి మధ్య స్నేహం పెరిగింది. ఈ క్రమంలో ఈ నెల ఒకటిన అర్ధరాత్రి సతీష్ ఇంటికి గణేష్ వచ్చాడు. తలుపు తీయమని చెప్పగా, అర్ధరాత్రి కావడంతో అందుకు సతీష్ నిరాకరించాడు. దీంతో కర్ర సాయంతో కిటికీలోంచి గడియ తొలగించి, ఇంటిలోకి వచ్చి సతీష్ పక్కన పడుకున్నాడు, తెల్లవారాక తన చొక్కా జేబులో రూ.6,912 మాయమైనట్టు సతీష్ గమనించాడు. దీనిపై గణేష్‌ను అడిగితే, నగదు తీయలేదని చెప్పాడు. ఇదే విషయమై ఆదివారం వీరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో సతీష్‌ను గణేష్ గట్టిగా కొట్టగా, గాయపడిన సతీష్‌ను అతడి బంధువులు అనపర్తి సీహెచ్‌సీలో చేర్పించారు. ఆస్పత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

కిశోర వికాసం శిబిరం ముగింపు

పెదపూడి: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పెదపూడి సచివాలయం-1, 2 మహిళా పోలీసులు జె.జెస్సీ జాస్మిన్, జి.సునీత అన్నారు. పెదపూడి గ్రామంలో కిశోర వికాసం వేసవి సెలవుల శిబిరం ముగింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మే 2 నుంచి కిశోర వికాసం వేసవి శిబిరాలు నిర్వహిస్తూ, బాల్య వివాహాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. బాలికల విద్య, ఆహారం, పోషకాహారం, బాలల హక్కులు-వారి రక్షణ, మంచి-చెడు స్పర్శ, ఆన్‌లైన్ భద్రత, సైబర్ నేరాలు తదితర వాటిపై అవగాహన కల్పించామని వివరించారు. బాల్య వివాహాలు చేసుకోవడంతో వచ్చే అనర్థాలను వివరించారు. అనంతరం గ్రామంలో ప్లకార్డులతో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కలవల కృష్ణమూర్తి, సచివాలయం కార్యదర్శి జి.ఉషారాణి, ఏఎన్ఎం సునీత తదితరులు పాల్గొన్నారు.

కుమార సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు



ప్రత్యేకాలంకరణలో కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

బిక్కవోలు: మండలంలోని కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద మంగళవారం భారీ అభిషేకాలు నిర్వహించారు. భారీఎత్తున భక్తులు అభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రామలింగ భాస్కర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నమ్మించి.. నట్టేట ముంచి..

- వలంటీర్ల సేవలను కొనసాగిస్తామని ఎన్నికల ముందు కూటమి నేతల హామీ
- తీరా అధికారంలోకి వచ్చాక ఆ వ్యవస్థకే మంగళం
- రోడ్డున పడ్డ 1,609 మంది వలంటీర్లు
- మోసపోయామని ఆవేదన
- ప్రజలకు దూరమైన కీలక సేవలు



పెదపూడిలో సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర వలంటీర్లను సన్మానిస్తున్న అప్పటి ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి (ఫైల్)

పెదపూడి: పైరవీలకు తావు లేకుండా ఐదేళ్ల పాటు లబ్ధిదారుల ఇళ్ల వద్దనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించి ప్రశంసలందుకున్న వలంటీర్ వ్యవస్థను కూటమి ప్రభుత్వం అటకెక్కించేసింది. గత ఏడాది ఎన్నికల ముందు.. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని, వారి గౌరవ వేతనం రూ.10 వేలకు పెంచుతామంటూ ఊరూవాడా హోరెత్తించిన కూటమి నాయకులు.. తీరా అధికారంలోకి వచ్చాక ఆ వ్యవస్థకు మంగళం పాడారు. ప్రభుత్వ చర్యతో వలంటీర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. నమ్మి మోసపోయామని వలంటీర్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలకు ఇంటి ముంగిటకే సేవలందించాలన్న గొప్ప సంకల్పంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చింది. ప్రతివార్డు, గ్రామ సచివాలయం పరిధిలో 50 కుటుంబాలకు ఓ వలంటీర్‌ను నియమించి సంక్షేమ పాలనను ప్రజలకు చేరువ చేసింది. దేశంలోనే తొలిసారి ఇలాంటి వ్యవస్థను ప్రవేశపెట్టి మన్ననలు అందుకుంది. అలాంటి వ్యవస్థను రాజకీయ అక్కసుతో కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కేసింది.

సేవకులు

2014-2019 మధ్య కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో రచ్చబండలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద పింఛన్ల కోసం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు గంటలకొద్దీ పడిగాపులు కాస్తూ, ప్రాణాలు కోల్పోయిన సంఘటనలూ అనేకం ఉన్నాయి. వీటికి పరిష్కారం చూపాలని 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక సచివాలయ వ్యవస్థకు రూపకల్పన చేయడమే కాకుండా, వలంటీర్లను నియమించి తెల్లారకముందే పింఛనుదారుల ఇళ్ల వద్దకు పంపించి, పింఛను మొత్తం ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వృద్ధులు అనారోగ్యంతో అస్పత్రిలో చేరితే వలంటీర్లు నేరుగా అక్కడికి వెళ్లి పింఛను అందజేశారు. తుపాన్లు, వరదల్లాంటి విపత్కర పరిస్థితుల్లోనూ పింఛనుతో పాటు, రేషన్ అందించడం వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల చేత శభాష్ అనిపించుకున్నారు.

పెద్దఎత్తున ఉపాధి

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు వరకు విజయవంతంగా కొనసాగిన వలంటీర్ల వ్యవస్థ ద్వారా పేద, నిరుద్యోగ యువత పెద్దఎత్తున ఉపాధి పొందారు. అప్పట్లో 20 నుంచి 35 ఏళ్ల వారు వలంటీర్లుగా చేరారు.

నాడు ప్రోత్సాహకాలు

కేవలం రూ.5 వేల గౌరవ వేతనంతో అంకితభావంతో విధులు నిర్వర్తిస్తున్న వలంటీర్లలో సేవా దృక్పథాన్ని మరింత పెంపొందించేందుకు వారికి గత ప్రభుత్వం నగదు పురస్కారాలను ప్రకటించేది. సేవా వజ్ర కింద రూ.45 వేలు, సేవా రత్న కింద రూ.30 వేలు, సేవా మిత్ర కింద రూ.15 వేలను ఏటా వలంటీర్లకు ప్రోత్సాహకాలను అందజేసింది.

దురుద్దేశంతోనే..

రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రికైన సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు పన్నిన కుట్రలో భాగంగా.. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం వలంటీర్ల వ్యవస్థను రద్దు చేసింది. ఆ నెపాన్ని వైఎస్సార్ సీపీపైనే నెట్టేందుకు యత్నించింది. విజయవంతమైన వలంటీర్ల వ్యవస్థ ద్వారా లభించే ఓట్లు గంపగుత్తగా వైఎస్సార్ సీపీకి పడకూడదనే దురుద్దేశంతో వలంటీర్లకు వేతనాలు పెంచి, వ్యవస్థను కొనసాగిస్తామని నమ్మించి.. అధికారంలోకి రాగానే కూటమి నేతలు వారిని నట్టేట ముంచారు.



పందలపాక గ్రామంలో పింఛను అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)

మండలాల వారీగా సచివాలయాలు, వలంటీర్లు ఇలా..

మండలం	సచివాలయాలు	వలంటీర్లు
అనపర్తి	20	438
బిక్కవోలు	20	434
పెదపూడి	20	367
రంగంపేట	19	370
మొత్తం	79	1,609

అబద్ధపు హామీలతో ముంచారు



ఎన్నికల సమయంలో కూటమి నాయకులు వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. రెట్టింపు వేతనం ఇస్తామని ఆశ పెట్టారు. వారి మాటలు నమ్మి సంతోషించాం. తీరా అధికారంలోకి వచ్చీరాగానే మమ్మల్ని రోడ్డున పడేశారు. అబద్ధపు హామీలతో నిట్టనిలువునా ముంచి, నమ్మకద్రోహం చేసిన కూటమి నేతలను ప్రజలు ఎన్నటికీ క్షమించరు.

– ఎస్.వెంకటేశ్వరరావు, మాజీ వలంటీర్, కాండ్రేగుల గ్రామం, పెదపూడి మండలం

పొట్టకొట్టడం అన్యాయం



రాష్ట్రానికి గర్వకారణమైన వలంటీర్ వ్యవస్థను కూటమి ప్రభుత్వం రద్దు చేయడం హేయమైన చర్య. కేవలం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంచి పేరు వస్తుందనే ఉద్దేశంతోనే ఈ వ్యవస్థను రద్దు చేసి, ప్రజల వద్దకు పాలన చేరకుండా అడ్డుకున్నారు. దీంతో కూటమి నాయకుల చర్యలను ప్రజలు యావగించుకుంటున్నారు.

– కేతా తులసి, ఎంపీపీ, పెదపూడి మండలం

ఆగని మట్టి అక్రమ రవాణా



నల్లమిల్లి జగన్నాథ సాగరం చెరువులో కొనసాగుతున్న మట్టి అక్రమ రవాణా



వై.ఐ. డివిజన్ ఈఈకి వినతిపత్రం ఇస్తున్న డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, నాయకులు

రంగంపేట: మండలంలోని నల్లమిల్లి గ్రామంలో ఉన్న జగన్నాథ సాగరం చెరువులో కొద్ది రోజులుగా జరుగుతున్న మట్టి అక్రమ రవాణా ఆగడం లేదని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాణరెడ్డి అన్నారు. అనుమతులకు మించి మట్టి అక్రమ రవాణా ప్రైవేట్ లేఅవుట్‌కు తరలిపోతుందన్నారు. విషయం తెలిసి ఆదివారం తాను ఆ ప్రాంతాన్ని పరిశీలించామని, అయినా అధికారులు చర్యలు చేపట్టలేదన్నారు. యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా మంగళవారం కూడా జరుగుతూనే ఉందన్నారు. స్థానిక రైతులకు ఉపయోగపడాల్సిన చెరువు మట్టి నిబంధనలకు విరుద్ధంగా దుర్వినియోగం అవుతోందన్నారు. 12 నుంచి 13 అడుగుల లోతుకు చెరువును తవ్వుతున్నారని, వర్షాలు పడినప్పుడు అధిక మొత్తంలో నీరు చేరి ప్రమాదాలకు దారితీస్తుందన్నారు. అంతేకాకుండా చెరువు గట్లకు గండి పడి, గ్రామం మునిగిపోయే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. దీనిపై వెంటనే సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు

మండలంలో జరుగుతున్న మట్టి అక్రమ తవ్వకాలను తక్షణం నిలిపివేయాలని కోరుతూ వైఎస్సార్ సీపీ అనపర్తి నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పార్టీ నాయకులు అధికారులకు ఫిర్యాదు చేశారు. రంగంపేట తహసీల్దార్ కోసు అనసూయ, వై.ఐ. డివిజన్ ఈఈను కలిసి మట్టి అక్రమ తవ్వకాలు, రవాణాపై వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ చెరువుల పూడికతీత పనులకు వై.ఐ. డివిజన్ ఈఈ ఆదేశాలు జారీ చేసినప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా బయట లేఅవుట్లకు తరలిస్తున్నారని నాయకులు ఆరోపించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, పార్టీ మండల నాయకులు నల్లా దుర్గాప్రసాద్, మట్టా శ్రీను, కొండేపూడి వెంకటరత్నం పాల్గొన్నారు.

దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

బిక్కవోలు: సాక్షి కార్యాలయంపై దాడికి పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని బిక్కవోలు విలేకరులు ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్‌కు వినతిపత్రం అందించారు. మీడియా సంస్థలైన సాక్షి దినపత్రిక, టీవీ చానల్‌పై ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని పాత్రికేయులు ఆరోపించారు. సాక్షి కార్యాలయాలపై దాడులను అరికట్టాలని బిక్కవోలు పోలీసు స్టేషన్‌లో ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ సాక్షి విలేకరి గొర్రిపోటి హేమసురేష్ మంగళవారం వినతిపత్రం అందించారు. అమరావతి రాజధాని అంశంపై సాక్షి టీవీలో ప్రసారమైన చర్చకు సంబంధించి కొందరు వ్యక్తులు చేపట్టిన నిరసనలు, రాళ్ల దాడులు, బెదిరింపులు, ఇతర దౌర్జన్య చర్యలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. టీవీ యాంకర్ కొమ్మినేని శ్రీనివాస్ అరెస్టును ఖండించడంతో పాటు, పత్రికా స్వేచ్ఛను కాపాడాలని పాత్రికేయులు కోరారు.

పార్టీ మారినా ఆయన తీరు మారలేదు

వైఎస్సార్ సీపీ నేత డాక్టర్ సూర్యనారాయణరెడ్డి



అనపర్తి: తన మనుగడ (సీటు) కోసం సిద్ధాంతాలు కలిగిన బీజేపీకి మారిన ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తీరు ఏ మాత్రం మారలేదని అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, 2014 నుంచి 2019 వరకు టీడీపీ ఎమ్మెల్యేగా ఉండగా రామకృష్ణారెడ్డి.. నియోజకవర్గంలోని ఏ చెరువుని వదలకుండా, ఒక్కొక్క చెరువుని సుమారు రూ.70 లక్షల నుంచి రూ.కోటి వరకు అమ్ముకున్నారని ఆరోపించారు. 2024 ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేయడంతో.. తన పాత తీరుని మార్చుకుంటారని ప్రజలు నమ్మి గెలిపిస్తే, తన పాత పద్ధతిని మార్చుకోలేదు సరికదా.. మరింత ఎక్కువగా ప్రకృతి వనరులు దోచుకుంటున్నారని విమర్శించారు. అవినీతి కార్యకలాపాలు మరింత దారుణంగా విస్తరించారన్నారు. రంగంపేట మండలం నల్లమిల్లి గ్రామంలో చెరువును తవ్వుతుంటే, గ్రామస్తులు, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి వెళ్లి వారి దోపిడీని బహిర్గతం చేస్తూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటికి కూడా ఎక్కడా అక్రమ తవ్వకాలు ఆపలేదన్నారు. స్థానికంగా గ్రామాల్లో, రైతుల అవసరాలు తీర్చకుండా పక్క మండలంలోని పందలపాక గ్రామానికి అక్రమంగా తరలిస్తున్నా ఎమ్మెల్యే స్పందించకుండా మిన్నకుండిపోవడం దారుణమన్నారు. ఇదేవిధంగా పిఠాపురంలో కూడా జనసేన నాయకులు చేస్తున్న మట్టి అక్రమ తవ్వకాలను స్థానిక టీడీపీ మాజీ ఎమ్మెల్యే వర్మ ఆ దందాను బహిర్గతం చేస్తే పవన్ కల్యాణ్ వెంటనే దానిని నిలిపివేశారన్నారు. కానీ అనపర్తిలో మాత్రం దానికి భిన్నంగా తండ్రి బీజేపీ ఎమ్మెల్యే, కుమారుడు టీడీపీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తుండడంతో, అడిగే వారు లేరన్న ధైర్యంతో వీరి అక్రమాలకు అంతు లేకుండా పోయిందన్నారు. ఇదే అంశంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో కోట్లాది రూపాయల మట్టి తరలించుకుపోతున్నారన్నారు. అందువల్లే ప్రజల సహకారంతో వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందని గుర్తుచేశారు.

వైఎస్ జగన్‌తో వడిశలేరు నేతల భేటీ



వైఎస్ జగన్‌ను కలిసిన వడిశలేరుకు చెందిన వైఎస్సార్ సీపీ నేతలు

రంగంపేట: మండలంలోని వడిశలేరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ శ్రేణులు మంగళవారం తాడేపల్లిలో పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామానికి చెందిన పార్టీ సోషల్ మీడియా కార్యకర్త పేరాబత్తుల శేఖర్‌పై కూటమి ప్రభుత్వం రాష్ట్రం నలుమూలలా అక్రమ కేసులు బనాయించారు. అతనిపై ఇప్పటికే 12 కేసులు నమోదు కాగా, తాజాగా కడప జిల్లా పులివెందులలో 13వ కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో వీరంతా అక్కడి పోలీస్ స్టేషన్‌లో 41 నోటీస్ తీసుకుని తిరిగొస్తూ, తమ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంలో పోలీసులు శేఖర్‌ను ఎలా ఇబ్బందులకు గురిచేశారో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయేలు ఆయనకు వివరించారు. దేనికీ అధైర్య పడవద్దని, పార్టీ, తాను అండగా ఉంటామని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికి భరోసా కల్పించారు. ఆయనను కలిసిన వారిలో పేరాబత్తుల శేఖర్, చేవ వీరబాబు, దూళ్ల నానిబాబు కూడా ఉన్నారు.

షైనింగ్ స్టార్ అవార్డు అందుకున్న చంద్రేడు విద్యార్థిని



కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న అనూహ్య

రంగంపేట: చంద్రేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మానూరి అనూహ్య షైనింగ్ స్టార్ అవార్డు-2025 అందుకున్నట్టు ప్రధానోపాధ్యాయుడు గంటా రమణబాబు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అనూహ్య పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిందన్నారు. రాజమహేంద్రవరంలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి కార్యక్రమంలో షైనింగ్ స్టార్ అవార్డును కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా అందుకున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా అనూహ్యను హెచ్ఎం రమణబాబు, సర్పంచ్ జాస్తి వెంకటపద్మావతి సత్తిబాబు, పాఠశాల కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.

రైతులకు వివిధ పథకాలపై అవగాహన

అనపర్తి: వ్యవసాయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే వివిధ పథకాలపై అవగాహన కల్పించే వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం మంగళవారం అనపర్తి ఏడీఏ డీవీ కృష్ణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయం, మత్స్య, పూల సాగు, ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రధానంగా పీఎం కిసాన్ యోజన, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ యాంత్రీకరణ, డ్రోన్ల వినియోగం, ఎరువులు, విత్తనాలపై సబ్సిడీ, ఉపాధి హామీ పనుల అనుసంధానం, వరి పొలంలో చేపల పెంపకం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రంలో నాటుకోళ్ల పెంపకం, పొట్టి మేకల పెంపకం, నూతన వరి వంగడాల ప్రదర్శనపై శాస్త్రవేత్తలు వివరించారు. కార్యక్రమానికి శాస్త్రవేత్తలు డాక్టర్ కె.సరళ, డాక్టర్ శిరీష, రవిచంద్ర, బి.సురేష్‌కుమార్, బలభద్రపురం మత్స్యశాఖ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు సామ్నా, శోభ, అనపర్తి మండల వ్యవసాయాధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్ల పరిశీలన



కరకుదురులో స్టూడెంట్ కిట్ల రిజిస్టర్ పరిశీలిస్తున్న భాస్కరరావు

పెదపూడి: సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర స్టూడెంట్ కిట్లు అందించడానికి జాబితాలు నిబంధనల ప్రకారం ఉండాలని స్టూడెంట్ కిట్ల విభాగం జిల్లా ఇన్‌చార్జి సీహెచ్ భాస్కరరావు అన్నారు. కరకుదురు గ్రామంలోని పాఠశాలలో ఉన్న స్టాక్ పాయింట్‌ను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టూడెంట్ కిట్లు, బుక్స్, రిజిస్టర్లు పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పలు రికార్డులు పరిశీలించారు. విద్యా శాఖ సీఎంఓ చామంతి నాగేశ్వరరావు, ఎంఈఓ-1, 2 కె.సత్యనారాయణ, సీవీవీసత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

గృహ నిర్మాణాల్లో అధికారులు ప్రగతి చూపాలి

హౌసింగ్ పీడీ భాస్కరరెడ్డి

కోరుకొండ: ప్రస్తుతం జరుగుతున్న గృహ నిర్మాణాల్లో పురోగతిని తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలని సంబంధిత అధికారులకు హౌసింగ్ పీడీ (స్పెషల్ డిప్యూటీ కలెక్టర్) ఎస్.భాస్కరరెడ్డి ఆదేశించారు. మంగళవారం సీతానగరం మండల పర్యటనకు వచ్చిన ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజినీర్లు, సహాయక ఇంజినీర్లకు పలు సూచనలు చేశారు. ఇనుగంటివారిపేటలోని హౌసింగ్ లేఅవుట్‌తో పాటు, మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న కుట్టు శిక్షణా తరగతులను పరిశీలించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి బి.రామ్‌ప్రసాద్, హౌసింగ్ ఏఈ ఎ.నాగచక్రం, ఎంపీడీఓ ఎం.భారతి, హౌసింగ్ డీఈఈ ఏవీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

200 రోజుల పని కల్పించాలి


ఏపీఆర్‌సీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

పెదపూడి: గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలకు 200 రోజుల పని దినాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం(ఏపీఆర్‌సీఎస్) ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్ అన్నారు. కైకవోలు గ్రామంలో ఏపీఆర్‌సీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంఘ జెండా ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ముందుగా గ్రామ పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, పేదలు, శ్రమజీవులకు అండగా నిలిచే ఎర్రజెండాను రైతు కూలీలు ఆవిష్కరించుకోవడం అభినందనీయమన్నారు. ఉపాధి కూలీలకు కనీసం రోజు కూలీ రూ.600 ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ డివిజన్ నాయకుడు మడికి సత్యం, ఎల్లే సత్తిబాబు, కడితి సతీష్, రెడ్డి దుర్గాదేవి, బొచ్చా ఏసు, రాయుడు గోవిందు, అఖిల్, బాబి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ర్యాంపు కోసం ప్రజాభిప్రాయ సేకరణ



సీతానగరంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్న భాస్కరరెడ్డి

కోరుకొండ(సీతానగరం): ప్రజాభిప్రాయ సేకరణ ద్వారానే ఇసుక ర్యాంపుల నిర్వహణ కొనసాగుతాయని ప్రత్యేకాధికారి భాస్కరరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన సీతానగరం పంచాయతీ కార్యాలయంలో ఇసుక ర్యాంపు కోసం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణకు ప్రాధాన్యమిస్తోందన్నారు. ఈ సందర్భంగా స్థానికుల నుంచి అభిప్రాయాలు సేకరించారు.